క్లుప్తంగా

50 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న యువతి

పొందూరు: భగత్‌సింగ్ యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు గొర్లె వసంతకుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వారి స్నేహితులు, అభిమానులు శనివారం రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 50 మంది రక్తదానం చేసి శ్రీకాకుళం రెడ్‌క్రాస్‌కు అందజేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ అడహక్ కమిటీ మెంబర్ కాళ్లకూరి శాంతారాం, పెంకి చైతన్య, ఎం.రాజేష్, భాగ్యలక్ష్మి, కల్యాణి ఉన్నారు.

పీహెచ్‌సీలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు



శస్త్రచికిత్స చేయించుకున్న వారికి సేవలు చేస్తున్న సిబ్బంది

హిరమండలం: మండలంలోని చొర్లంగి ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో శనివారం పది కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసినట్లు వైద్యాధికారి యశ్వంత్ తెలిపారు. వైద్యాధికారులు వేణు, సంతోష్, వైద్యసిబ్బంది ఉన్నారు.

17న వాయిదా పడినచోట ఎస్ఎంసీ ఎన్నికలు

హిరమండలం: వాయిదా పడిన పాఠశాలల్లో ఈ నెల 17వ తేదీన ఎస్ఎంసీ ఎన్నికల నిర్వహణకు శనివారం నోటిఫికేషన్ విడుదల చేసినట్లు ఎంఈవో కె.రాంబాబు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. హిరమండలం మండలంలోని గొట్టా ప్రాథమికోన్నత పాఠశాల, ఆర్అండ్‌ఆర్ కాలనీ ప్రాథమిక పాఠశాల, హిరమండలం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో కోరం లేక ఎన్నికలు వాయిదా పడ్డాయన్నారు. ఈ పాఠశాలల్లో ఈనెల 12వ తేదీన ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి ..తిరిగి జాబితాను సరిచేసి ప్రదర్శిస్తారు. 17న ఉదయం ఏడు నుంచి మధ్యాహ్నం ఒంటి గంటలోపు ఎన్నికలు ఆయా పాఠశాల ప్రధానోపాధ్యాయుల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఎంఈవో పేర్కొన్నారు. ఎన్నికలు సజావుగా జరిగేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు.

మాదకద్రవ్యాలతో భవిష్యత్తు నాశనం



మాట్లాడుతున్న సీఐ దివాకర్‌యాదవ్

ఆమదాలవలస: మాదకద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం చేసుకోవద్దని ఆమదాలవలస సీఐ వాయునందన్ దివాకర్ యాదవ్ అన్నారు. మండలంలోని తాళ్లవలస వద్ద గల కేజీబీవీ విద్యార్థినులకు మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువత మత్తు పదార్థాలకు బానిసై విలువైన జీవితాన్ని కోల్పోవద్దని అన్నారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా చదువుపై ప్రత్యేక దృష్టిసారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు. ర్యాగింగ్, ప్రేమ, మత్తు పదార్థాల వినియోగం, రవాణా తదితర అంశాలు యువతీ యువకులను నిర్వీర్యం చేస్తున్నాయని చెప్పారు. దీని వలన యువత విద్యపై దృష్టి కేంద్రీకరించలేక వారు ఇబ్బందులు పడడంతోపాటు తల్లిదండ్రులను కూడా ఇబ్బందుల్లోకి నెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ కె.వెంకటేష్, కేజీబీవీ ఎస్‌వో పి.శిరీష ఉన్నారు.

పంటల నమోదు తప్పనిసరి



పంటల వివరాలు నమోదు చేస్తున్న సిబ్బంది

హిరమండలం: రైతులంతా తప్పనిసరిగా పంటల వివరాలను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి బి.సంధ్య తెలిపారు. వ్యవసాయ, రెవెన్యూ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో హిరమండలంలో చేపడుతున్న పంటల నమోదు ప్రక్రియను శనివారం ఏవో పర్యవేక్షించారు. క్షేత్రస్థాయిలో రైతులు ఏ సర్వే నంబర్‌లో ఏయే పంటలు సాగుచేస్తున్నారో తదితర వివరాలను తెలిపి అధికారులకు సహకరించాలని సూచించారు. పంటల నమోదు చేసుకున్న రైతులు ప్రభుత్వం అమలు చేసే అన్ని పథకాలకు అర్హత పొందుతారన్నారు. మద్దతు ధరకు ధాన్యం విక్రయించుకోవచ్చునన్నారు. కౌలు రైతుల సైతం పంట నమోదు చేసుకోవాలన్నారు. మండలంలో ఈ ఖరీఫ్‌లో 7,200 ఎకరాల్లో వరి సాగు చేస్తుండగా.. ఇప్పటి వరకు సుమారు 150 ఎకరాల్లో నమోదు ప్రక్రియ జరిగిందన్నారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయక అధికారులు పాల్గొన్నారు.

● వైద్య శిబిరం



పాతపట్నం మండలంలోని బైదలాపురం ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర పాఠశాలలో మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని శనివారం నిర్వహించారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు జి.సదాశివ రోగులకు వైద్య సేవలు అందించి అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం న్యాయ విజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాతపట్నం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.రోషిణి మాట్లాడుతూ.. గిరిజనులు ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గిరిజన గూడల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. న్యాయవాది ఎం.రమణ, హెచ్‌ఎం డి.గొరేసు ఉన్నారు.

-పాతపట్నం

● వార్షికోత్సవం



నరసన్నపేట మండలం కలివరపుపేటలోని షిర్డీసాయి మందిరం 16వ వార్షికోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సాయినాథునికి ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం కాకడ హారతి, పాలు, పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకం చేపట్టారు. అనంతరం సహస్ర నామార్చన, హారతి, మంత్ర పుష్ప పూజలు జరిగాయి. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం సాయి భక్తి గీతాలను ఆలపించారు. అలాగే ఆలయంలో ఉన్న వినాయక విగ్రహంతో పాటు ఇతర విగ్రహాలకు భక్తుల వితరణతో రెండున్నర కిలోల వెండితో తయారు చేసిన కిరీటాలు అమర్చినట్టు కమిటీ ప్రతినిధి నీలం తెలిపారు.

-నరసన్నపేట

● వినతి



మెళియాపుట్టి మండలంలోని శివారు ప్రాంతమైన గోకర్ణపురం గ్రామానికి బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని, కరజాడ, గంగన్నపేట, గాతలవలస గ్రామాలకు మంచినీరు, పాఠశాలలకు ప్రహరీ నిర్మాణం చేపట్టాలని బీజేపీ, జనసేన పార్టీ నాకయులు కోరారు. ఈ మేరకు ఆ పార్టీ రవికుమార్, ప్రసాద్‌లు పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, పాతపట్నం నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్‌లకు శనివారం వినతిపత్రాలను అందజేశారు. మారుమూల గ్రామాల్లో ప్రజలకు సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

-మెళియాపుట్టి

ముగిసిన శిక్షణ తరగతులు



నరసన్నపేట: హాజరైన సర్పంచ్‌లు, కార్యదర్శులు



హిరమండలం: మాట్లాడుతున్న ఎంపీడీవో స్వరూపారాణి



పాతపట్నం: పాల్గొన్న అధికారులు

● పంచాయతీలను అభివృద్ధి బాటలో నడిపించాలని వక్తలు సూచన

హిరమండలం: పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు మూడు రోజుల పాటు నిర్వహించిన శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. హిరమండలం మండల కేంద్రంలో నిర్వహించిన ముగింపు కార్యాక్రమంలో ఎంపీడీవో డీడీ స్వరూపారాణి పాల్గొన్నారు. పంచాయతీలను అభివృద్ధిబాటలో నడిపించాలని సూచించారు. ప్రజాప్రతినిధులు, క్షేత్రస్థాయి అధికారుల సమిష్టి కృషితో గ్రామాలు అభివృద్ధి బాటలో నడుస్తాయన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. చెత్తనుండి సంపద తయారీ కేంద్రాలు, వీధిలైట్లు, మంచినీటి వనరుల నిర్వహణపై అవగాహన కల్పించారు. ఈవోపీఆర్‌డీ నాగమణి ఉన్నారు.

పాతపట్నం: సర్పంచ్‌లకు పంచాయతీ పాలనపై పూర్తిస్థాయిలో అవగాహన ఉండాలని ఈవోపీఆర్డీ కృష్ణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరం జరిగిన ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సినియర్ అసిస్టెంట్ మిశ్రా, అరుణ్‌కుమార్ ఉన్నారు.

సారవకోట: సర్పంచ్‌ల శిక్షణ ప్రక్రియ తూతూమంత్రంగా జరిగింది. మొదటి రోజు 12 మంది సర్పంచ్‌లు హాజరు కాగా ముగింపు రోజున కేవలం ఇద్దరు సర్పంచ్‌లు మాత్రమే హాజరైయ్యారు. ఈఓపీఆర్డీ రేణుక సచివాయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు పలు అంశాలపై సూచనలు చేసి మమా అనిపించారు.

సరుబుజ్జిలి: సరుబుజ్జిలి మండలంలో ముగింపు కార్యక్రమానికి రావివలస పంచాయతీ సర్పంచ్ మాత్రమే హాజరయ్యారు. మండలంలో 21 మంది సర్పంచ్‌లు ఉన్నారు.

ఎల్.ఎన్.పేట: ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవటం, గ్రామ సభల్లో ప్రజా భాగస్వామ్యం కల్పించటం వలన గ్రామాలను అభివృద్ధి చేసుకోవచ్చని ఎంపీడీవో గిరిబాల అన్నారు. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు. గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వాములను చేయాలన్నారు. పారిశుద్ధ్య నిర్వాహణ, పంచాయతీలకు ఆదాయం తెచ్చిపెట్టే మార్గాలను సృష్టించుకోవటం కీలకమన్నారు. పంచాయతీల పరిధిలో ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిరక్షించటం, కాలువలు, చెరువు గట్లపై కొబ్బరితో పాటు పలు రకాల పండ్ల మొక్కలు నాటి ఆదాయ వనరులు సృష్టించుకోవాలని అన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు కిలారి త్రినాథులు, ఈవోపీఆర్డీ ఐ.పద్మజ, మాస్టర్ శిక్షకులు జయమోహన్ పాడి ఉన్నారు.

నరసన్నపేట: సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శుల శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఎంపీడీఓ రామకృష్ణ పాల్గొన్నారు. సర్పంచ్‌లు శిక్షణలో తెలుసుకున్న అంశాలను పంచాయతీల్లో అమలు చేయడానికి ప్రయత్నించాలని సూచించారు. ప్రధానంగా ఆర్థిక వనరుల అభివృద్ధికి ప్రతీఒక్కరూ కృషి చేయాలన్నారు.



సారవకోట: శిక్షణలో పాల్గొన్న సచివాలయ సిబ్బంది, కార్యదర్శులు



సరుబుజ్జిలి: హాజరైన రావివలస సర్పంచ్ (సర్కిల్‌లో ఉన్న వ్యక్తి)



ఎల్.ఎన్.పేట: మాట్లాడుతున్న ఎంపీడీవో గిరిబాల

దాడికి పాల్పడిన వారిని అరెస్టు చేయాలి



నరసన్నపేట: అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

● అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన

పాతపట్నం: విజయవాడలోని సామాజిక మహాశిల్పంపై కూటమి ప్రభుత్వం దాడి చేసి అంబేడ్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేయడానికి చేసిన ప్రయత్నాన్ని నిరసిస్తూ మండల కేంద్రం పాతపట్నంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలియజేశారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ విగ్రహంపై దాడి చేసిన నిందితులను వెంటనే అరెస్టు చేయాలని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఎనుగుతల సూర్యం, బి.నారాయణమూర్తి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ మద్దు తాతయ్య, మండల ప్రత్యేకాహ్వానితుడు ఎం.గణపతిరావు, మండల కో ఆప్షన్ సభ్యుడు మాదవ్ పుల్లాయ్ డిమాండ్ చేశారు. పాతపట్నం కోర్టు కూడలి వద్ద ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా ప్రపంచంలోనే అతి ఎత్తైన అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేసిందన్నారు. ఆ విగ్రహంపై ఈ నెల ఎనిమిదో తేదీ రాత్రి టీడీపీ మూకలు దాడి చేయడం దారుణమన్నారు. నిందితులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. అంతకుముందు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. నిరసనలో తెలిపిన వారిలో వైఎస్సార్‌సీపీ నాయకులు పనుకు మోహన్, తూలుగు ప్రవీన్, గోకవలస రాము, అమర రమణ, సుధా, సీహెచ్ త్రినాథరావు, డి.జోగారావు, శ్రీధర్, జీవా, సాయి ఉన్నారు.


నరసన్నపేటలో..

నరసన్నపేట: సామాజిక మహాశిల్పంపై దాడిని ఖండిస్తూ వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. నరసన్నపేటలోని అంబేడ్కర్ విగ్రహరం వద్ద కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేశారు. కూటమి ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీలు ఆరంగి మురళి, వాన గోపి, జెడ్పీటీసీ సభ్యుడు చింతు అన్నపూర్ణ, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, నాయకులు కరిమి రాజేశ్వరరావు, చింతు రామారావు, ముద్దాడ బైరాగినాయుడు, కేసీహెచ్‌బీ గుప్త, కణిత సత్తిబాబు, మొజ్జాడ శ్యామ్, నక్క తులసీదాస్, వరుడు వంశీ కృష్ణ, దండి జయప్రకాశ్, సురంగి నర్సింగరావు, మహిళా ప్రతినిధులు రాజాపు హైమావతి, పుట్టా ఆదిలక్ష్మి పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వుత్తులతో నిరసన తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పోలీసుస్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ



హిరమండలం: పోలీస్ క్వార్టర్లను పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

హిరమండలం: హిరమండలం పోలీసు స్టేషన్‌ను శనివారం జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. స్టేషన్‌లోని రిసెప్షన్ కేంద్రంతో పాటు పరిసరాలను, పోలీస్ క్వార్టర్స్‌ను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. సిబ్బంది విధులు.. వారి పనితీరుపై ఆరా తీశారు. ప్రతిఒక్కరూ క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలన్నారు. రాత్రివేళలో ముమ్మరంగా పెట్రోలింగ్ చేయడంతో పాటు గస్తీ విధులు పటిష్టంగా నిర్వహించి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై దృష్టిసారించాలన్నారు. ఎస్సై జి.నారాయణస్వామి ఉన్నారు.



సరుబుజ్జిలి: రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

రాత్రి గస్తీ ముమ్మరం చేయండి

సరుబుజ్జిలి: రాత్రి పోలీస్‌గస్తీని ముమ్మరం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి సిబ్బందికి సూచించారు. సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌ను ఎస్పీ శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా స్టేషన్ రికార్డులు, క్రైమ్‌రేట్ తదితర అంశాలను పరిశీలించారు. పాతనేరస్తులు, అనుమానిత వ్యక్తులు, రౌడీషీటర్ల వివరాలపై ఆరా తీశారు. నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. స్టేషన్ పరిధిలో పెండింగ్ ఉన్న కేసులపై సమన్లు జారీచేసి కోర్టులకు హాజరు పరచాలని సూచించారు. సమస్యలుఏమైనా ఉంటే తన దృష్టికి తెస్తే పరిష్కరిస్తానని సిబ్బందికి హామీ ఇచ్చారు. ఎస్సై నిహార్, ఏఎస్ఐ చంద్రినాయుడు, పోలీస్‌సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న అమ్మినాయుడు

ఆమదాలవలస: సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్ మెట్ట అమ్మినాయుడు ప్రజలకు సూచించారు. పురపాలక సంఘంలోని ఒకటో వార్డు పరిధి తిమ్మాపురంలో ప్రజలకు యూనియన్ బ్యాంక్ వారి సౌజన్యంతో ఎస్.ఎస్.టి. స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు డబ్బులను పొదుపు చేయాలని అన్నారు. ఫలానా బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా కాల్‌చేసి ఏటీఎం పిన్ నంబర్, బ్యాంక్ అకౌంట్ వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎవరు ఫోన్లు చేసి వివరాలు అడగరని స్పష్టం చేశారు. ఏటీఎం కార్డు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే డిజిటల్ పేమెంట్స్ వ్యవస్థ గురించి వివరిస్తూ నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకం 18 నుంచి 50 సంవత్సరాలలోపు వారికి వర్తిస్తోందని.. సంవత్సరానికి 436 రూపాయలు ప్రీమియం చెల్లించాలని పేర్కొన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, 14448 టోల్ ఫ్రీ నంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్లు చిగురుపల్లి వెంకటేష్, రామారావు, ఆర్పీలు రాజ్యలక్ష్మి, జయలక్ష్మి ఉన్నారు.

డీఎస్సీ స్టడీ మెటీరియల్ పంపిణీ

నరసన్నపేట: మంచి ఉద్దేశంతో ఉచితంగా సమకూర్చిన డీఎస్సీ స్టడీ మెటీరియల్‌ను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. కోమర్తి కూడలి వద్ద ఒక కల్యాణ మండపంలో డీఎస్సీ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను కొల్లి రాంబాబు సిద్ధంగా చేయగా... వీటిని ఎమ్మెల్యే శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అభ్యర్థులు మెటీరియల్‌ను సద్వినియోగం చేసుకొని ఉద్యోగాలు సాధిస్తే వితరణ చేసిన వారి ఆశయం నెరవేరుతోందన్నారు. నియోజకవర్గంలో ఎంపిక చేసిన 170 మందికి స్టడీ మెటీరియల్‌ను అందించారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బలగ ప్రవీణ్‌కుమార్ ఉన్నారు.



అభ్యర్థులకు స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న రమణమూర్తి

ఇరుకు గదుల్లో ఇక్కట్లు!

● కేజీబీవీలో అదనపు గదుల నిర్మాణాలు పూర్తిచేయాలని కోరుతున్న విద్యార్థినులు

ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణ శివార్లలో తాళ్లవలస వద్ద గల కేజీబీవీలో ఉంటున్న విద్యార్థినులు వసతి సమస్యను ఎదుర్కొంటున్నారు. చాలీచాలని గదుల్లో ఇక్కట్లు పడుతున్నారు. ఇక్కడ ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియెట్ వరకు 235 మంది విద్యార్థినులు చదువుతున్నారు. వీరంతా రాత్రి, పగలు పాఠశాలలోనే ఉండాల్సి ఉంది. అయితే ఇంతమందికి కేవలం పది తరగతి గదులే ఉన్నాయి. ఆ తరగతి గదుల్లోనే పగలు తరగతులు వింటూ, రాత్రిపూట పడుకోవాల్సి వస్తోంది. వీరితోపాటు ఇక్కడ 26 మంది టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. వీరందరి పెట్టెలు, దుస్తులు, వస్తువులు, పుస్తకాలు అదే గదుల్లో ఉంచుతున్నారు. దీంతో ఇరుకుగదుల్లో నానా ఇక్కట్లు పడుతున్నామని విద్యార్థినులతోపాటు సిబ్బంది కూడా ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు ఫేజ్-2 కార్యక్రమంలో పాఠశాలకు అదనపు తరగతి గదుల నిర్మాణాలకు రూ. 87 లక్షలు మంజూరు చేసి పనులు చేపట్టారు. అయితే ఆ పనులు చివరి దశలో నిలిచిపోయాయని, పనులు త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తెస్తే సమస్య పరిష్కారం అవుతోందని విద్యార్థినులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



నిర్మాణంలో ఉన్న అదనపు తరగతి గదులు

జనావాసాల మధ్య చెత్తకుప్ప!

సారవకోట: మండల కేంద్రంలోని కొత్తపేటవీధిలో జనావాసాల మధ్య చెత్తకుప్ప దర్శనమిస్తుంది. ఇప్పటికే పారిశుద్ధ్యం క్షీణించడంతో వ్యాధులు ప్రబలుతున్నాయి. చెత్త పేరుకుపోవడంతో రోగాలకు కారణమైన ఈగలు, దోమలు అధికంగా వ్యాపించడంతో పాటు దుర్వాసన వస్తుందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



జనావాసాల మధ్య ఉన్న చెత్తకుప్ప

ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు



టెక్కలిలో యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్న సంఘ నాయకులు

టెక్కలి: ఉపాధ్యాయ సమస్యలపై రాజీలేని పోరాటాలు చేస్తున్న యూనియన్ యూటీఎఫ్ అని ఆ సంఘం నాయకులు అన్నారు. శనివారం టెక్కలిలో ఘనంగా యూటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పతాక ఆవిష్కరణలు చేశారు. అనంతరం సంఘ నాయకులు మాట్లాడుతూ...యూటీఎఫ్ ఆశయాలను నచ్చి ఎంతో మంది ఉపాధ్యాయులు సంఘంలో చేరుతున్నారని వెల్లడించారు. 50 వసంతాలు సందర్భంగా కాకినాడలో జరగనున్న స్వర్ణోత్సవ కార్యక్రమాలకు సంఘ నాయకులంతా హాజరు కావాలని కోరారు. అలాగే ప్రభుత్వం వెంటనే 117 జీఓ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ సంఘ నాయకులు పి.గణపతి రావు, టి.వైకుంఠరావు, పి.ధర్మారావు, కుమార స్వామి, తదితరులు పాల్గొన్నారు.

దేవదాయ భూముల పరిశీలన



భూమిని పరిశీలిస్తున్న ఈఓ వాసుదేవరావు

కాశీబుగ్గ: మందస మేజరు పంచాయతీ కేంద్రంలో దేవదాయ ధర్మదాయ శాఖకు చెందిన 112/1, 112/2, 112/3, సర్వే నంబర్లలో 4ఎకరాలు 67 సెంట్ల భూమిని దేవదాయ శాఖ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ టి.వాసుదేవరావు శనివారం పరిశీలించారు. రట్టి గ్రామంలోని వల్లభ నారాయణ స్వామి ఆలయానికి చెందిన ఈ భూముల విలువ మార్కెట్ రేటు ప్రకారం సుమారు రూ.15 కోట్లు ఉంటుందని అంచనా. ఈ భూములు ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, వాటిని అడ్డుకోవాలని తహసీల్దారుకు రాతపూర్వకంగా తెలియజేస్తామన్నారు. పరిశీలనలో అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.